# నిరంకుశాధిపత్య పాలన సాగిస్తున్న బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం

**భారతదేశ** ఆర్థికవ్యవస్థ త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోనుందనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఘనమైన ప్రకటనను స్వాగతిస్తూ, ఆయనను అభినందిస్తూ భారత కార్పొరేట్ రంగంలో ఒక ప్రముఖుడైన ఆడి గోద్రెజ్ ఈవిధంగా వ్యాఖ్యానించాడు: "అభివృద్ధి ఆకాంక్షలు, కలలు ముందుకు సాగుతున్నప్పటికీ అదంత సులువైనదేమీ కాదు. పేదరికం ఈనాటికీ మన దేశాన్ని పట్టిపీడిస్తున్న భయంకర వ్యాధిగా వుంది. అసహనం పెరిగి పోవటం, సామాజిక అస్థిరత, ద్వేషపూరిత నేరాలు, మహిళలపై హింస, నైతిక విధి నిషేధాలు, మరియు అనేక రూపాల్లో సాగుతున్న అసహనాలు దేశవ్యాపితంగా పెచ్చుమీరు తున్నాయి". ఈవిధంగా అతనే మనదేశంలో నెలకొన్న చీకటి కోణాల్ని వాస్తవికంగా పేర్కొన్నాడు.

అయితే, సిగ్గుమాలిన ఈ పరిస్థితులను జాగ్రత్తగా మార్పుచేయటానికి, ప్రజాజీవితాన్ని మెరుగుచేయటానికి, వారికి సంక్షేమాన్ని అందించటానికి ప్రయత్నించకపోగా, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం మనదేశ పాలనా వ్యవస్థను నిరంకుశ, ఆధిపత్య పాలనా వ్యవస్థగా రూపొందించటానికి నిర్ణయించుకుంది.

ప్రజల జీవితాలను వారి హక్కులను నష్టపరిచే, చాలా తీవ్రంగా ప్రభావితంచేసే నిర్దిష్ట ప్రాధాన్యత గలిగిన బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టి, వాటిపై ఎలాంటి చర్చలు లేకుండా మొరటు మెజారిటీతో దొర్లించుకుంటూ పోవటాన్ని చూపినపుడు, ఈ బిల్లులలోని ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావంతోనే బిల్లులు ఆమోదం పొందినపుడు – బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ నిరంకుశాధిపత్య పాలనను సాగించే ప్రయత్నాలు చేస్తున్నదని అందరూ ఎత్తి చూపారు.

అన్ని ప్రజాస్వామిక సూత్రాలను వారు తోసిపుచ్చారు. పార్లమెంటరీ సాంప్రదాయాలుగా చెప్పబడే వానినన్నింటినీ ప్రక్కకు నెట్టి వేశారు. వారు నిర్లజ్జగా బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టామనిపించి, చట్టాలుగా ఆమోదం పొందేట్లు చేసుకున్నారు. ఈవిధంగా చేయటం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు వికృత పార్శ్వాన్ని ప్రజా ప్రతినిధులుగా, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించాల్సిన చట్ట సభలలోని సభ్యుల జోక్యానికి సంబంధించిన వంచనను కూడా ఈ సమావేశాలు వెల్లడిచేశాయి. "నిర్హేతుకంగా, విశేషాధికారాలతో వ్యవహరించే అవినీతికర ప్రభుత్వాల పాలిట ఓ ఆయుధం"గా దాని నిర్మాతలైన అరుణ్‌రాయ్ వంటివారు అభివర్ణించే అనేక పోరాటాల ఫలితంగా పొందిన సమాచారహక్కు చట్టం(ఆర్‌టిఐ)– 2005ను ఓ చట్టసవరణ ద్వారా నీరుగార్చి వేశారు. అధికారుల హోదాలను హేతుబద్ధీ కరించే ఉద్దేశ్యంతో ఈ సవరణ చేశామని చెప్పారు. అయితే ఈ సవరణ ఆర్‌టిఐ అధికారుల హోదా, కాలపరిమితిలతోపాటు ప్రభుత్వ సేవకులవలెనే కమిషనర్ విధులను కూడా నిర్వచించింది. వారి స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛ తొలగించివేశారు. ఇప్పుడు వారు నిష్పాక్షికంగానూ, స్వతంత్రంగానూ వుండే కమీషనర్లుగా వుండలేరు. యంత్రాంగాన్ని గుప్పెటలో పెట్టుకున్న స్వార్థ ప్రయోజనా పరులకు ఉపయోగం కలిగించే తిరోగామి చర్య ఇది. ఆర్‌టిఐ చట్టం – 2005కు ఈ సవరణ చేయటంతో బిజెపి – ఎన్‌డిఏ ప్రభుత్వం స్వార్థపరులు చేసే తప్పుడు పనులపై కొంతైనా నిఘా పెట్టకలిగిన ఈ చట్టం యొక్క ప్రయోజనకర ప్రభావాన్ని తొలగించివేసింది.

గత పార్లమెంటు సమావేశాలలోనే 'మానవ హక్కుల పరిరక్షణా చట్టం–1993' అనే మరో చట్టాన్ని కూడా మార్పు చేశారు. ప్రభుత్వంచే నియమితులైన వారు మాత్రమే జాతీయ మానవహక్కుల కమిషనర్‌గా కొనసాగుతారని ఈ సవరణ హామీ ఇస్తోంది.

1993 నాటి మానవహక్కుల పరిరక్షణా చట్టం ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వారు మాత్రమే ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షునిగా వుండటానికి అర్హులు. కానీ ఆ చట్టానికి చేసిన ప్రస్తుత సవరణ ప్రకారం, మాజీ భారత ప్రధాన న్యాయమూర్తితోపాటు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి కూడా ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షునిగా కొనసాగవచ్చు. ఈ విధంగా ప్రస్తుత సవరణ ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షున్ని నియమించుకునే విచక్షణాధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టింది. మరోమాటలో చెప్పాలంటే 'జీహుజూర్' అనే వారినే ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షునిగా నియమించు కునేందుకు మార్గాన్ని వేసింది.

ఇంకా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఏపిఏ–ఉపా)కు కూడా ఈ పార్లమెంటరీ సమావేశాలలోనే సవరణలు చేశారు. ఇందిరాగాంధీ ప్రధానిగా వున్న కాలంలో 'ఉపా' చట్ట రూపం దాల్చింది. ఆనాటి నుండి వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ తమ అధికారాలను మరింతగా పెంపుచేసుకుంటూ సవరణలు చేసుకుంటూ వస్తున్నారు. ఈ చట్టం 2004 సం॥లో సవరణ పొంది సమగ్ర టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంగా రూపొందింది. ఈ చట్టంలో టెర్రరిజాన్ని నిరోధించే, లేదా టెర్రరిస్టులను శిక్షించే చర్యలను కూడా పొందుపరిచారు. ఆ తర్వాత ఈ చట్టం 2008లోను, 2013లోను టెర్రర్‌ను ఎదుర్కొనేందుకు, చట్టపరిధిని సవరించేవిధంగా సవరణలు పొందింది.

తిరిగి ఎన్‌డిఏ ప్రభుత్వం యూనియన్ హోంమంత్రి అమిత్‌షాకు అనుగుణంగా 'ఉపా' చట్టాన్ని సవరించింది. దీనిప్రకారం

ఎవరినైనా టెర్రరిస్టు లేదా అర్బన్ నక్సలైట్‌గా ప్రకటించవచ్చు. 2019 నాటి 'ఉపా' చట్టం దేశంలోని భద్రతా సంస్థలకు విశేషాధికారాలు కల్పిస్తోంది. దీనిప్రకారం ఆ సంస్థలు అనుమానితుల నెవరినైనా 'టెర్రరిస్టు'గా పేర్కొని వారి ఆస్థులను సైతం జప్తు చేయవచ్చు. ఈ సవరణతో వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కులను కోల్పోవటమే జరుగుతోంది. టెర్రరిస్టుగా ఎవరినైనా ముద్ర వేస్తే, దాని దుష్ఫలితాలు, ఆ వ్యక్తి ప్రతిష్టకు అది కల్గించే నష్టం తిరిగి పూడ్చుకోలేనిది. అలా ప్రకటించబడిన వారిని అరెస్టుచేసి, నిర్బంధంలోకి తీసుకోవచ్చు. అంతేగాక కోర్టులనుండి బెయిల్ పొందివున్నప్పటికీ వారిని నిర్బంధించే అధికారాన్ని ఈ సవరణ కల్పిస్తోంది. ఈ దోషాన్ని మోయటంతోపాటుగా వారి కదలికలు అన్నింటినీ కుదించివేయటం జరుగుతుంది. రాజ్యంతో కలిసి నడిచేవారు కాని వారెవరికి వ్యతిరేకంగానయినా భద్రతా బలగాలు స్వేచ్ఛగా చర్యలు తీసుకోవటానికి దీనితో అవకాశం కల్పించారు.

దర్యాప్తు సంస్థలకు విశేష అధికారాలు కల్పించిన కొలదీ అవన్నీ దుర్వినియోగమవు తాయనేది మన గత అనుభవాలు చెబుతున్నాయి. టెర్రరిస్టులను లేదా వారి సానుభూతిపరులను ప్రత్యేకించి 'అర్బన్ నక్సలైట్'లను తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని కేంద్రహోంమంత్రి అమిత్‌షా చేసిన హెచ్చరిక, ఈ చట్టం ఎన్ని విధాలుగా దుర్వినియోగం కాబోతున్నదో చెప్పకనే చెపుతున్నది.

మాజీ కేంద్రమంత్రి పి.చిదంబరం సందేహం వెలిబుచ్చినట్లుగా 'రాజద్రోహానికి' 'చట్ట విరుద్ధ కార్యకలాపాలకు' నడుమ దగ్గరి సరిపోలికను చూడవచ్చు.

ఈ చట్టాన్ని వ్యక్తుల స్థాయిలో అమలు చేస్తే, ఆతని ప్రాధమిక హక్కులపై ఘోరమైన దుష్ఫలితాలను చూపుతుంది.

ఇక, దీనితో ఎవరైతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తుతారో వారందరినీ 'టెర్రరిస్టు'లుగా సులభంగా ఎలాంటి విచారణ చేయకుండానే ముద్రవేయవచ్చు. బిజెపి-ఎన్‌డిఏ ప్రభుత్వం 'ఉపా' చట్టానికి ఈ సవరణ తేవటంతో ప్రభుత్వ వ్యతిరేక స్థితిని చట్టవిరుద్ధ మరియు టెర్రరిస్టు కార్యకలాపాల స్థితికి సమానం చేసింది.

పైన పేర్కొన్న చట్టాలకు ఈ సవరణలు చేయటంద్వారా ప్రభుత్వం తన అధికారాలను అమలుచేయటంలో చట్టబద్ధంగా జవాబు దారీతనం లేకుండా వుండేందుకు మాత్రమే కాకుండా అధికారాలన్నింటినీ తన వద్దే కేంద్రీకరించుకోవటానికే చేస్తున్నదని స్పష్టమౌ తున్నది.

నిరంకుశాధిపత్య పాలనను నెలకొల్పటం మినహా ఇది వేరుకాదు. బిజెపి-ఎన్‌డిఏ ప్రభుత్వం తనకు కట్టబెట్టిన అధికారాలను తప్పుగా వినియోగిస్తూ తప్పుడు పాలన కొనసాగిస్తోంది.

ఈ అప్రజాస్వామిక, అణచివేతతోకూడిన, క్రూర సవరణలు చేయటంద్వారా బిజెపి-ఎన్‌డిఏ ప్రభుత్వం గుంజుకున్న విశేష అధికారాలన్నీ ఖచ్చితంగా ప్రజావ్యతిరేకమైనవీ; నిరంకుశమైనవే.

ఈ అణచివేత చట్టాలకు వ్యతిరేకంగా ఒక బలమైన ఐక్య ప్రజాఉద్యమం నేటి తక్షణా వసరంగా వుంది.

ooo